

దశిక సూర్యప్రకాశరావు గారు

బాలుడు—అమ్మా! ఆతని కెవరయినను సహాయము చేసెడివారా ?

తల్లి:—నాయనా! మహావీరునికి సహాయము చేయనివా రెవరు? వారి సహాయముననే అతఁడు దేశకల్యాణ మొనరించుచుండును. సాంద్రారణ్యప్రదేశముల సెలయేటి కన్నియల నృత్యము కన్నులారఁ వీక్షించి వీక్షించి, అక్కడి వాయుసంరంభమున కచ్చెరువంది, ఉన్నతములగు పర్వతములఁగని, వనసంతానసంపద నవలోకించి వీనినే తన హృదయవిశాలతకు సహాయులుగ నొనర్చుకొని దేశకల్యాణమునకుఁ బాటుపడుచుండును. తాను స్వయముగ ఏకాంతవాస మొనర్చి సృష్టిశృంగారమునుండి బోధాభ్యసనము గావించుకొని తన దేశము నెదుర్కొన్న కఠినసమస్యలను బరిష్కరించుచుండును. అట్టివారే మహావీరులు.

బా—కొందఱిని పేర్కొన్నగాని నాకు సరిగా బోధపడదు.

త—బౌద్ధమతమును స్థాపించిన బుద్ధభగవానుఁ డట్టివాఁడు. షణ్మతోద్ధారకుఁడై అద్వైతమును నెలకొల్పిన శంకరాచార్యు లట్టివాఁడు. హిందూదేశమున ముసల్మానుప్రతిభ మంటఁగలిపి హైందవ సామ్రాజ్యము స్థాపింప నమకట్టిన శివాజీ యట్టివాఁడు. ఐరోపాసింహామని పేరుగాంచిన నెపోలియను చక్రవర్తి యట్టివాఁడు. కవితా సామ్రాజ్యమునకు పట్టభద్రుఁడయిన కాళిదాసు మహావీరుఁడు. సర్వసంగపరిత్యాగ మొనరించి దేశాంతరముల హిందూమత ప్రాశస్త్యమును జాటివచ్చిన వివేకానందరామతీర్థు లట్టివారు.

బా—అమ్మా! నే నంతటివాఁడను కాఁగలనా?

త—అట్లే కావచ్చును. వారి కలవడిన మంచిగుణములను నీ వభ్యసించితివేని అంతటి మహాకార్యములు చేయఁగలవు.

బా—నేను గవిత్వము నేర్చుకొందును. అమ్మా! ఇప్పటి నుండియే మన గురువుగారియొద్ద పద్యము లల్లుట నేర్చుకొందును. అప్పుడు నే నొక కాళిదాసును కాఁగలను.

త—నాయనా! నీవు తొందరపడుచుంటివి. కాళిదాసు మహావీరులలో నొకఁడు. మహావీరుని గుణాతిశయములను దెలియఁబఱచెదను. అట్టి గుణసంపత్తి నీకలవడినగాని మహావీరుఁడవు కాఁజాలవు. ఇంక సావధానముగా వినుము.

మహావీరుఁ డెన్నఁడును తన కీపని కావలెనని ఆపని కావలెనని నాందోళన మొందఁడు. తాను వాంఛించిన వస్తువునకై పెనఁగులాడఁడు. తనమానసక్షేత్రము వెండిపళ్లెరమువలె స్వచ్ఛమై నిర్మలమయి వెలుఁగొందుచుండును. తనకోరికలు తనమనస్సులోఁ బ్రత్యేకస్థాన మాక్రమించుకొనఁజాలవు.

బా—అదెట్లు తల్లీ! కోరికలులేనిది, వాటికై పెనఁగులాడనిది కార్యసిద్ధి యెట్లు?

త—అదియే వివరించెదను : ఒక మహారాజు గలఁడు. అతని పట్టాభిషేకసమయమున తన దర్బారు భవన

మును జిత్రాలంకారములచే నలంకరింపవలెనని కుతూహలము కలిగియుండెను. తన దేశములోని గొప్పగొప్ప చిత్రకారులను రావించెను. తన యాస్థానమున ఉన్నతములయి నిడివిగలిగి ఒకదానికొకటి ఎదురుగానున్న రెండుగోడలపైనను చిత్రములను లిఖింపవలసినదని ఇరువురు చిత్రకారులను నియోగించెను. ఎవ రాహ్లాదకరముగ వ్రాయఁగలరో వారికి గొప్పబహుమాన మొసంగెదనని చాటించెను.

ఆ రెండుగోడలకును ఒకరి నొకరు చూచుకొనకుండఁ దెఱలు కట్టఁబడినవి. చిత్రకారు లా తెఱలలోపలఁగూరుచుండి ఎవరిగోడమీఁద వారు తమ చిత్తరువులనువ్రాయుచుండిరి. ఎవరిధోరణి వారిదే. ఎవ రేచిత్రములువ్రాయుచున్నారో ఇతరులకుఁ దెలియదు.

ఇట్లు కొన్నిదినములు గడచినవి. చిత్రకారులు తమచిత్తరువులను పూర్తిచేసిరి. పరీక్షాదిన మేతెంచినది. రాజు,ప్రధానుఁడు మొదలగు మంత్రులను,సామంతులను,రాజబంధువులను,పురోహితులను, దేశప్రముఖులను,దండనాథులను వెంటఁగొని ఆ యలంకారములుచూచి చిత్రలేఖకులకు బహుమతు లొసంగవలెనని విచ్చేసెను.

మొదట ఒకగోడపైఁగల తెఱ తీసివేయఁబడెను. రాజు మొదలు ప్రజలందఱును ఆశ్చర్యనిమగ్నులయిరి. ఆహాహా!ఆచిత్రములనుండి జీవకళయుట్టిపడుచున్నదిగదా! ఆ ప్రతిమలసౌందర్యము, ఆవర్ణవిచక్షత, ఆ మేధాసంపద అపూర్వములని కొనియాడిరి. ఇఁక రెండవగోడపైఁగల చిత్తరువులను జూడకయే యీచిత్రలేఖకునికే మొదటి బహుమాన మీఁదగునని పెక్కుండ్రు దలంచిరి.

రెండవగోడపైఁగల తెఱను దీసివేసిరి. ఆశ్చర్యవాల్పక మొగమంతయుఁ గన్నులుచేసి చూచువారును, నోరుతెఱచి నివ్వెఱపోవువారును, 'ఓహోహో'యనువారును, 'అపూర్వ'మని యనువారును నయియుండిరి. ఈగోడపైఁ గల ప్రతిమలన్నియు మొదటి గోడపైనున్నవియే. రవంతేనియు భేదములేదు. మొదటిగోఁడమీఁదఁ ఏబొమ్మకు ఏరంగువేయఁబడినదో రెండవగోడమీఁద గూడ ఆబొమ్మకు ఆరంగే వేయఁబడియున్నది. రెండుగోడలమీఁది ప్రతిమలకును చీమకాలంత భేదమయినను ఎవరును గనిపెట్టలేకపోయిరి. ఒక్కవిషయము: మొదటిగోడ చిత్తరువులకంటె రెండవగోడ చిత్తరువులు మనోహరములుగా నున్నవి; నూతన సౌందర్యమునఁ బ్రకాశించుచున్నవి; స్నిగ్ధములై తళతళలాడు కాంతుల నీనుచున్నవి. రెండవ చిత్రకారుడుచేసినపని యిది: అతఁడు తన గోడమీఁద చిత్రములు వ్రాయలేదు. తనకున్న కాలమునంతయు నా రెండవగోడను శుభ్రపఱచుటయందును,ఇంకను శుభ్రపఱచుటయందును, మఱియింకను శుభ్రపఱచుటయందునే వినియోగించెను. అందుచే నీ రెండవ గోడ స్నిగ్ధమై ధవళమై ప్రకాశమానమై అద్దమువలెఁ బ్రతివస్తువును తనలోఁ బ్రతిబింబించుకొనుచుండెను. కనుకనే మొదటిగోడ చిత్తరువులు క్రొత్తమెఱుఁగులతో నీగోడమీఁదఁ బ్రతిఫలించినవి. కావున రెండవ చిత్రలేఖకుని మేధాసంపదను గొనియాడిరి.

అట్లే మహావీరుఁడు తన మనస్సును పరిశుద్ధముగా నుంచుకొనును. అప్పుడే అన్నిసమస్యలను బరిష్కరించుటకు సమర్థత కలిగియుండును. కాళిదాసు మహావీరుఁడు. తా నిట్లు కవిత్వము చెప్పవలెనని కుందుచుండుననుకొందువా? కవిత్వము చెప్పవలెనని ప్రాకులాడునా? ఆతనికి రసావేశము కలిగినప్పుడు తాటాకును గంటమును జేతఁబూని గూరుచుండును. తన్నుఁ దామఱచును. తానేమి చేయుచుండునో తనకుఁ దెలియదు. తాను రచించు శ్లోకములందు లీనమయిపోవును. తన రచనలనుండి అమృతమొలికినట్లు మనము గుర్తించుచుందుము. తా నెన్నఁడును వికారము నొందఁడు. మనఃఫలకము నిర్మలమై ప్రకాశించుచుండును. ప్రతిమహావీరుఁడును, సామ్రాజ్యస్థాపనకుఁ గడంగిన నెపోలియను నయితము సర్వసేనల

నాయత్తముచేసి శత్రుసేనలతో యుద్ధము సలుపుఁడని తన దండనాథులకు ఆజ్ఞనిచ్చి, తాను తనసేనలకు వెనుకగుట్టముపైఁ గూరుచుండి ఏయాందోళనలులేక ఏమానసవికారమును బొందక తనమనస్సునకు సంపూర్ణశాంతి నొసంగి ఎన్నిరాత్రములనుండియో విశ్రాంతి యెఱుంగని తన శరీరమునకు విశ్రాంతినిచ్చి ఒకింతసేపు నిదుర వోయెడివాఁడని వినుచుందుము. ఆ మానసిక స్వచ్ఛతయే తన్ను మహాప్రతిభాశాలిఁగా నొనర్చినది.

స్వామి రామతీర్థులు పర్వతప్రదేశముల ఋషుల చెంగట నిష్టాలాపము లాడుకొనుచుండెను. తన చిన్న కుమారుని మరణము వినిపించుటకై ఆయన బందుగుఁడొకఁ డాయన చెంతకువచ్చి నీళ్లు నములుచుండెను. చివర కావార్త యెఱిఁగించెను. స్వామి రామతీర్థులు మందహాస మొనరించి "దీనికింత కావలెనా, అందు విశేషమేమున్నది? గాలి వీచుచున్నది; సూర్యుఁ డస్తమించుచున్నాఁడు; నదులు ప్రవహించుచున్నవి; తరువులు చిగుర్చుచున్నవి. అని చెప్పుటయెంతో అట్లే ఆతఁడు మరణించెనని చెప్పుటయు"ననెను. అట్టి ప్రశాంతచిత్తము గలిగిన యాతఁడే మహావీరుఁడు. అతఁడే యుత్కృష్టకార్యములు చేయసమర్థుఁడు.

కెమల్‌పాషా ఒక్కఁడు. ఒకవంక గ్రీకుసేనలు తన్నలముకొనుచున్నవి. సామ్రాజ్యసేనలు ముట్టడించుచున్నవి; టర్కీసేనలు వాటిముందు లెక్కలేనట్లున్నవి; దాస్యశృంఖలములనుండి తన మాతృదేశమగు తురుష్కస్థానమును తప్పించుటకు దండనాథుఁడై శత్రుసేనల నుఱుమాడి సామమున బ్రిటీష్వరాసుమంత్రులతో సంధికొఱకై యత్నించి విఫలమనోరథుఁడై పెక్కుమాఱులు యుద్ధముఁ జేసి లాతివారలకు టర్కీ ప్రతిభఁ జూపి ప్రజాసామ్రాజ్యమును స్థాపింపఁగలిగెను. అతఁడు మహావీరుడు. అతని మానసకేదారము పరీక్షించితిమా శుద్ధమై, వాంఛాశూన్యమై యుండును. అట్టి పరిపూర్ణతయే లేనియెడల అశ్కార్యము సాధించియే యుండఁడు.

బా—అమ్మా! కోరికయే లేనియెడల కార్యమెట్లు పుట్టఁగలదు?

త—అది చక్కని ప్రశ్న. మహారాజు దర్బారు భవనమునకువచ్చి ఒకరినిజూచి మందహాసము చేయును; ఒకరితో ఉల్లాసముగఁ బ్రసంగించును; మఱియొకరితో ఆవస్తువు నిటు తెమ్మనును; ఒకని నెక్కడకో పంపును. పై పనులు జరిగినను జరుగకపోయినను ప్రభువునకు విచారము లేదు. ఆపనులకై యతఁడు పరితాపపడఁడు.

కోరికలేనిది కార్యమేలేదు. కాని దానికొఱకు పరితాప పడఁగూడదు. కర్మావలంబుఁడై కృత్యము లాచరించుచుండవలెను. తత్ఫలసిద్ధికై పెనఁగులాడఁ గూడదు. జయలబ్ధి యయినయెడల నే నింతపని చేసితినని గర్వపడరాదు. అపజయమునకు దుఃఖపడఁ గూడదు. దీనినే నిష్కామకర్మ యందురు.

బా—ఏదయినకృత్య మాచరించునప్పుడు అవాంతరములగు దుఃఖముల భంగపఱచు చుండుట సహజము కాదా!

త—అట్టి సమయములందే మహావీరుఁడు ప్రశాంతచిత్తము కలిగియుండును.

ఒకరాజొకప్పు డొకపేదబాలికను వివాహమాడెను. ఆమెపేరు గ్రిశీలద. ఆమెసుగుణవతి. రాచ నగరునకు రాఁగానే అమూల్యములగు వస్త్రాభరణములనలంకరించుకొనియుండెడిది. ఆమెలేఁ తమోహమున నిరంతరము చిఱునవ్వు నాట్యమాడుచుండెడిది. ఆమె యెప్పుడు నానందదాయినియయి యుండెడిది. ఇట్లుండ నారాజదంపతుల కొకకొమార్తె కలిగెను. ఒకనాఁడు రాజు తన భార్యను బిలిచి "ప్రేయసీ! అనర్థము సంభవించుచున్నది గదా! దేశములో కుట్రదారులు పెక్కండ్రు కుట్రలు సలుపుచున్నారు. నీవు నీచవంశమునుండి వచ్చినదానవని, నీకుమార్తె తదనంతరము రాజ్యార్హ కాదనియు దురాలోచనాపరులు, తంత్రములు పన్నుచున్నారు. నా కిదెం

తయు దుస్తరముగా నున్నది. కావున మనబాలికను కత్తికి అప్పగించితినా యీముప్పు గడచునని తోఁచుచున్నది. ఏమి నీయభిప్రాయ" మనెను.

గ్రిశీలద ధైర్యము తెచ్చుకొని 'మీయిష్టమే నాయిష్ట' మనెను. అంతట రాజా బాలికను జంపించెదనని తీసికొనిపోయెను. ఇట్లు గ్రిశీలద మఱియిద్దఱు పురుషశిశువులను గనఁగా వారినిగూడ రాజు పైకారణమువల్లనే కొనిపోయెను.

నిత్యము గ్రిశీలద చేయుపని యేమో తెలియునా? తనకుఁ బ్రత్యేకముగా నొక ఏకాంతగృహమును ఏర్పాటు చేసికొనెను. ఆగృహమునఁ గూర్చుండి ఆమె విలపించుచుండునని నీవు తలంచుచుందువు. ఏకాంతగృహముఁ జేరి తనరాణీదుస్తులను, అమూల్యాభరణములను దీసి



యొకచోనుంచి, పూర్వము తాను పేదబాలికగా నున్నప్పుడు ధరించిన చినిఁగినపేలికలను గట్టుకొని యిట్లు మననము చేయుచుండును. "ఈరాజభవనములు, ఈభాగ్యభోగ్యములు, ఈ యమూల్యాలంకారములు, ఈమహావైభవములు నాఆత్మతేజస్సును మలినము చేయకుండుఁగాక! నాఆత్మజ్యోతిస్స్వచ్ఛమై, అమలమై, అమృతజ్యోత్స్నమై, అవ్యయమై,నిర్వికల్పమై! సచ్చిదానంద నిలయమై,సహస్ర దీధితులతోఁ బ్రకాశమానమై వెలుఁగొందుఁగాక! ఈశిశువుల అకాలమరణదుఃఖము నాప్రశాంతచిత్తమును, స్వరూపమును భంగపఱుపకుండుఁగాక ! అఖండతేజోనిలయమై, సర్వవ్యాప్తమై, నిత్యానందస్వరూపమై వెలుఁగొందు నాపరంజ్యోతియే నేనన్నయంశము మఱువకుండుఁగాక!" అని తనబ్రహ్మస్వరూపమును నిత్యమును పరిశీలించుకొనుచుండెడిది. అట్లామె దివ్యతేజశ్శక్తులు గలిగి ఐహికభోగములకు సుఖదుఃఖములకు అతీతయై యుండెడిది. ఆమె యానందమును ఏదుఃఖములును కలఁతపఱుపలేకపోయెను.

కొంతకాలమున కామె నీచవంశసంజాతయని గ్రిశీలదనే రాజు వెడలఁగొట్టించెను. ఆమె సంతోషముతోఁ గొంచెమయినను కలఁతలఁ జెందక తనతండ్రి పర్ణకుటీరమునకు జీర్ణవస్త్రములు ధరించి వెడలిపోయెను.

పిదప రాజు ఇంకొకబాలికను వివాహమాడ నిశ్చయించెను. నూతనవధువును సంభావించుటకు మరలఁ దనరాచనగరునకు రావలసినదని రాజు గ్రిశీలదను బిలిచెను. గ్రిశీలద యందుల కంగీకరించెను. ఈ వైహిక కార్యము లేమియు నామెమానసవికాసమునకు వికారము కలిగింపలేకపోయినవి.

క్రొత్తపెండ్లికూఁతురు రాచనగరికి విచ్చేసెను. ఆమెవెంట ఆమెఇరువురుసోదరు లుండిరి. చిన్నపిల్లలు. అపూర్వమయిన వార్త యొకటి వినవచ్చెను. క్రొత్తపెండ్లికూఁతును, ఆయిరువురుబాలురును ఒకరాజుచేఁ బెంపఁబడుచున్నట్లు తెలియవచ్చినది. ఆరాజు పిల్లలను గొందఱు హంతకులయొద్దకొసన్నట్లును, జాడలు తీయఁగా ఆపిల్లలుమువ్వురును గ్రిశీలదబిడ్డ లయినట్లును దెలిసినది. అట్టిచోఁ దనకన్నబాలికను మనరాజు వివాహమాడఁడుగదా! ఇప్పటికి గ్రిశీలద సుశీలత ఆమెనిత్యప్రశాంతహృదయము కుట్రదారులనుసయితము కరఁగించివేసెను. అంతట దేశప్రజలయనుమతిని రాజు తనపిల్ల

లను గ్రిశీలదను మరల స్వీకరించెను. అప్పుడును గ్రిశీలద తాను బ్రహ్మస్వరూపిణి ననియే తలంచుచుండెడిది.

నాయనా! అట్టి నిర్మలచిత్తము, అట్టిప్రశాంతము మహావీరుఁడు కలిగియుండును. దుఃఖము లాతనిసంకల్పములకు విఘ్నము చేయఁజాలవు.

బా—అమ్మా! నా కొకచక్కని ఆలోచన తోఁచుచున్నది. దానివలన సర్వకార్యములు నెఱవేఱునని తలఁచుచున్నాను. ధనమువలన ప్రాభవము గలుగును; దానివలన పలుకుబడి గలుగును; దానినుండి గౌరవము హెచ్చును; దానినుండి కీర్తిగలుగును. ఇన్ని కలిగినవానికిఁ గార్యములు సుగమము లగుచుండును. అందువలన ధనార్జనమునకుఁ గీర్తిని గడించుటకు, గౌరవమును సంపాదించుటకు మనుష్యుఁడు యత్నముచేసినయెడల మహావీరుఁడు కాఁగలఁడని అనుకొనుచున్నాను; ఏమందువు ?

త—దేశకల్యాణ మొసర్చిన మహావీరు లెవరును ధనవంతులు కారు. ఆసంసర్గము విడిచినతరువాత నే వారు మహాకార్యములు సాధింపఁగలిగిరి. బుద్ధభగవానుఁడు తనసామ్రాజ్యభోగములను, ధనకనకవస్తువాహనములను విసర్జించియేఉత్తమోత్తమధర్మములను బ్రజలకుఁ జాటగలిగెను. దేవేంద్రనాథటాగూరు తనజమీదారీనివిడిచి భోగములను ద్యజించి, కఠననియమములకు లోనయి హిమాలయ ప్రాంతముల శీతాతపములచే శిక్షనుబొంది బ్రహ్మమతమును స్థాపింపఁగలిగెను. టాల్‌స్టాయ్‌ప్రభువుకూడ తనజమీదారీని విడిచి అరణ్యముల కేఁగి ప్రజాసేవామాహాత్మ్యమును జాటఁగలిగెను. ఎందఱో మహావీరులు తమకుఁగల సర్వస్వమును ద్యజించినందువలననే ఉత్కృష్టధర్మములు చాటఁగలిగిరి కాని ధనతృష్ణవలన నెవరును మహావీరులు కాలేదు.

సూర్యభగవానుఁ డెల్లప్పుడు (తేజస్సు) నొసంగుటయేకాని కైకొనుట యెఱుంగఁడు. అతని మహాత్యాగమువలననే ఇంకను బ్రకాశించుచున్నాఁడు. అతఁ డిచ్చుచుండుటయేకాని స్వీకరించుట యెఱుఁగఁడు. కావున త్యాగమువల్ల ఉత్కృష్టమగు ధర్మగుణములు పట్టువడును దానివల్లనే కార్యసిద్ధి యగుచుండును.

ఒకప్పుడు తటాకమునకును నదికిని వివాదము సంభవించెను. తటాకము, నదిని జూచి, “ఓసీ! నదీ! నీ వెంతపిచ్చిదానివలె నున్నావు. నీకుఁగల అమృతోదములను ఏల వెఱ్ఱిదానవై తీసికొనిపోయిపోయి ఉప్పసముద్రములోఁ బాఱఁబోయుచున్నావు? నీయుదకమును నీలోననే యుంచుకొన్నయెడల నీయంతటిభాగ్యశాలు లింక నుండఁబోరు. నన్నుఁజూ నీళ్లను ఎక్కడకును బోనీయక చుట్టును కట్టలు నే నెంత యానందముగా నున్నానో? నాలో నెన్ని తామరలు, ఎన్ని కలువలు ఎట్లా నందించుచున్నవో కావున నామాటవిని నీనీటిని పంటకాలువలకని, తటాకములకని, సముద్రమునకని వృథాచేయక ప్రవహించుట మాని నిలువ చేసికొమ్ము” అనెను.

నది, తటాకమును జూచి నవ్వి “నీయుపదేశము సరియయినది కాదు. నే నిట్లు ప్రవహించుచుండుటచేతనే ఎల్లప్పుడు నారాయణస్వరూపిణియే యయియుందును. ఇదియే నాపరమధర్మము” అనెను.

కొంతకాలమునకు తటాక మెట్లయినదో తెలియునా? దానియందు నాచు, తెల్లు, తుంగ మొలచి నీరు దుర్వాసనఁబట్టి అందఱికిని నిరుపయోగమై అందఱును దిట్టుచుండ వ్యర్థజీవితము గడపుచు తుదకు నీటిచుక్కయినను లేకుండ సాంతముగ నెండిపోయెను.

నదీదేవియో కలకలలాడునెమ్మొగముతో, పవిత్రోదకములు గలిగి, జనులచేఁ బూజింపఁబడుచు నిజేశ్వరుఁడగు సముద్రునియంకముఁ జేరుచుండెను.

కావున త్యాగమువల్ల యశము, గౌరవము, కార్యసిద్ధి తమంతట తామే వచ్చుచుండును. మహావీరుఁ డట్టి త్యాగమునే ముంజేతికంకణముగా ధరించును.

బా—త్యాగము దేనివలన లభించును?

త— ఐహికభోగము లశాశ్వతములని ప్రగాఢముగఁ దెలిసికొనుటవల్లను, అకల్మషమగు ప్రేమవల్లను అది లభించుచున్నది.

పూర్వమున ధారానగరమును రాజధానిగాఁ గొని సింధులమహారాజు మాళవరాజ్యమును బాలించుచుండెను. మరణకాలమందుఁ దన చిన్నకుమారుఁడగు భోజమహారాజును దనతమ్ముఁడగు ముంజమహారాజునకు అప్పగించి స్వర్గస్థుఁ డయ్యెను. ముంజునకు రాజ్యకాంక్షఁ గలిగి భోజునిఁ జంపుటకుఁ గొందఱు కిరాతుల నియమించెను. వారు భోజుని దీసికొని అరణ్యమునకుఁ బోయి తాము నెరవేర్పనున్న కార్యమును భోజునకెఱిఁగించెను. భోజుఁడు పదమూఁడువత్సరముల ప్రాయ



మువాఁడు. చెంతఱాలిన పండుటాకు నొకదానిని దీసికొని ఒఱనుండి మొలబాకును బెఱికి, తొడచీఱి, అందలిరక్తమునఁ దడిపి ఆయాకుపై నొకశ్లోకము వ్రాసి తనపినతండ్రియగు ముంజున కీయవలసినదని కిరాతకుల కిచ్చి తమ కార్యము నెరవేర్చుకొమ్మనెను.

కిరాతు లాబాలునిఁ జంపఁ జేతులాడక విడిచిపుచ్చి వెడలిపోయిరి. కిరాతులు దెచ్చినలేఖను ముంజమహారాజు చదువుకొనెను. అం దిట్లున్నది. "కృతయుగమునకు అలంకారభూతులయిన మాంధాతాది నృపాలురును, త్రేతాయుగమున మహాతేజశ్శాలురై పాలన మొనర్చిన శ్రీరామాదులును, ద్వాపరమున విశేషయశము గడించిన పాండవేయులు మొదలగు ధరణీశ్వరులును అంత్యకాలమునఁ దృణమయినను దీసికొనలేకపోయినారు. నీవుచూడఁగా నీకలియుగమున సమస్తసామ్రాజ్యమును మూర్ధముపై నలంకరించుకొని దివి కేఁగఁ గలవని తోఁచుచున్నది."

ఈలేఖను జదువుకొని నేలపైఁబడి పొరల నారంభించెను. "ఓహో! ఈమాత్రము ఐహికవిరాగము నాకుఁ గలుగలేదుగదా" యని దుఃఖించి తాను జేసినపనికి మిక్కిలి వగవ నారంభించెను.

ఐహికవిరాగమువల్లనే త్యాగగుణ మలవడును.

బా—మహావీరునకు సంపద లుండవని యర్థమా? త్యాగి దరిద్రుఁడేకదా!

త—మహావీరునకు సంపద లున్నను లేకపోయినను సమానమే. విదేహరాజ్యమును బాలించిన జనకమహారాజునకు రాజ్యము లేదా? కలదు. ఉన్నను ఆధనమదాంధత అతనిఁ జేరలేదు. అతఁడు మహాజ్ఞాని; వేదవ్యాసుఁడు తనకుమారుఁడగు శ్రీశుకుని జ్ఞానోపార్జనకై ఆజనకచక్రవర్తికడకుఁ బంపెను.

త్యాగి దరిద్రుఁ డెన్నఁడును గాఁడు. అతఁడే భాగ్యశాలి. 'నాయిల్లు' అన్నవస్తువే లేనప్పుడు అందఱి భవనములు నతనివే యగుచున్నవి. ఒకరికి అమూల్యవస్తువు లున్నప్పుడు, అవితనకుఁగలిగినట్లే సంతసించును అవి తనకు లేవనుకొన్నప్పుడు దుఃఖము గాని ఉన్నవనుకొన్నప్పుడు లేదుగదా! లోకములోని సమస్తపదార్థములు తనవగుటవల్లనే ఆతఁడు మిగుల భాగ్యశాలి త్యాగి. విత్తమంతయు ప్రేమవలననే ఆర్జించుచుండును. అన్నియు మనవస్తువులే యనుచుండును.

బా—మహావీరుని యితరగుణము లెవ్వి?

త—సత్యసంధతయు, ఋజుమార్గమును, కార్యదీక్షయు త్యాగసంసర్గమువలననే లభించును. ప్రశాంతహృదయమువలన నిత్యానంద మనుభవించు చుందును

బా—కవియగు మహావీరుఁడును, మతప్రవక్తయగు మహావీరుఁడును, చక్రవర్తి యగు మహావీరుఁడును, రాజకార్యధురంధరుఁ డగు మహావీరుఁడును ఇందఱు గలరని చెప్పితివి. వీరిలో నెవ రధికులు?

త—వీరందఱును మహావీరులే. వలయు గుణములన్నియుఁ గలిగియుండుటయే ప్రధానముగాని, అతఁడు కవియైన నేమి? చక్రవర్తియైన నేమి? అం దధికు లెవ్వరు?.

కాలస్వభావమునుబట్టియు, పూర్వజన్మ వాసనను బట్టియు వారిలో నొకరు మతప్రవక్తయు, రాజనీతివిశారదుఁడగుటయు సంభవించుచున్నదిగాని వారందఱు పూజ్యులే. అట్టివారే దేశకల్యాణ మొనరింపఁగలరు. అందఱును సమానులే.

బా—ఒక్కముక్కలో మహావీరుఁడు కార్యములెట్లు చేయఁగలఁడో చెప్పఁగలవా?

త—ఈకథ వినుము: ఒకప్పు డొకయోగిపుంగవుఁడుగలఁడు. అతఁడు తేజశ్శాలి. ఆయన తేజః ప్రభావమున కచ్చెరువంది దేవతలు దేవేంద్రునికడకుఁ బోయి, "మహాప్రభూ! భూలోకమునన్నున్న యాఋషిచంద్రునకు వర మేదయినఁ గటాక్షింపవే" యని యడిగిరి. అట్లయిన యేవరము కావలెనో కనుఁగొనిరం డని దేవేంద్రుఁడు వారిని బంపివేసెను. దేవత లాయనచెంతకు వచ్చి, 'స్వామీ! దేవేంద్రుఁడు తమ్మనుగ్రహించి వర మీఁదలఁచియున్నాఁడు; తమయిచ్ఛ వచ్చినది కోరుకొనుఁ" డనిరి.

"పరమేశ్వరునిదయ యున్నది; చాలును. నాకేమియు నవసరములే" దనెను ఋషి.

దేవత లాయనను బలవంతపెట్టి ఏదయిన వర మడుగక తప్పదనియు, అడుగకపోయినయెడలఁ దాము బలవంతమునసైన నేదే నొకటి యిచ్చిపోవుదుమనియు నిర్బంధపఱచిరి.

వారి కాయన యిట్లనెను. "నాకుఁ దెలియకుండ నిరంతరము నేను సేవచేయున ట్లనుగ్రహింపుఁడు" అని వేఁడెను.

అంతట ఋషిపుంగవుఁడు పోయిన బాటపొడుగనను, ఆయన క్రీనీడ పడినంతమేరను పాపులు పుణ్యవంతులగుచుండిరి; రోగు లారోగ్యముఁ గాంచుచుండిరి; ఎండుమ్రాకులు చిగిర్చి పుష్పించుచుండెడివి. ఆయనగాలి సోఁకినంతమేర సమస్తము పవిత్ర మగుచుండెడిది. ఆయన నందఱును "దివ్యచ్ఛాయ" యని పిలుచుచుండిరి.

కావున మహావీరుఁడు తనకుఁ దెలియకుండ, నిరంతరసేవానిమగ్నుఁడై యుండునని చెప్పినఁ జాలును.


# అమృతాంజనము

## సర్వవిధములగు నొప్పులకు సంజీవివంటి దివ్యౌషధము

చక్కని డబ్బీలో సహా సీసా 1-కి 10 అణాలు మాత్రమే

## అమృతాంజనముడిపో, బొంబాయి, లేక, మదరాసు